# మీ జాబులు - మా జవాబులు

ఈ సంచికలో తిరిగి మేధామాత్రికలు శీర్షిక ప్రారంభిస్తున్నందుకు ఎంతో మంది పాఠకులు వ్యక్తీకరించిన ఆనందమునకు హృదయము కేరింతలు కొడుతున్నది.' ప్రేక్షకుల చప్పట్లే మాకు దుప్పట్లు' అన్న సహస్రావధాని శ్రీ గరికపాటి నరసింహారావుగారి మాటలు జ్ఞప్తికి వస్తున్నాయి. ప్రేక్షకులు ఆనందంతో చప్పట్లు కొడితే ఏ కళాకారునికైన అంతకంటే ప్రేరణ ఏమి కావాలి. సాక్షాత్తూ హనుమంతుని విషయములో కూడా మిగిలిన వానర-వీరులంతా హనుమంతుని శక్తిసామర్ధ్యములను పొగుడుతుంటే విని, అతని శక్తి రెట్టింపు అయ్యి, సీతాదేవి జాడ కనుగొనడమనే కార్యమునకై జలధిని అవలీలగా లంఘించాడు. సరే ఇక మేధామాత్రికలు శీర్షికను ఆస్వాదించండి. ||సం||

*** *** ***

**అనంత్ కరణం, క్యూపర్టినో, కాలిఫోర్నియా.**

జనవరి 21వ తేదీ. బుధవారం. బయట ఆకాశము మేఘావృతమై ఉంది. గత రెండు రోజులుగా విపరీతమైన ఎండ. మళ్ళీ శీతకాలం వాతావరణం. ఉదయాన్నే భారతదేశమునుండి విన్న విషయము వాతావరణము మాదిరిగానే చాలా నిరుత్సాహముగా ఉంది. పైగా గత రెండు వారములుగా కార్యాలయములో పని వత్తిడి, అకస్మాత్తుగా తగ్గడం ఇంకో కారణం.

ఉత్సాహం తెచ్చుకోడానికి ఏమైనా చెయ్యాలని మంచి సంగీతం కోసం, తరువాత తెలుగు సాహిత్యం కోసం ఇంటర్నెట్‌లో ఎంత వెదికినా ఆనందాన్ని పొందలేక పోయాను. వెదికే ప్రయత్నం చెయ్యగా చెయ్యగా - గూగుల్ శోధనలో సంఘమిత్ర పత్రిక లింక్ కనబడింది. నా పాత స్నేహితుడు నాకు అభినందనలు తెలుపుతున్న అనుభూతి కలిగింది. వెంటనే సంక్రాంతి సంచికను తీసి చదవడం మొదలుపెట్టాను. మొదట '*ముఖచిత్రం గురించి మూడు ముక్కలు*' చదివాను. తరువాత చికాగోలో చినజీయర్ స్వామీజీతో వేసవి శిబిరం గురించి చదివాను. ఆ సందర్భము నాకు తెలుసును గనుక, ఆసక్తితో చదివిన నాకు మనసు ఆనందంతో ఉరకలేసింది. ధన్యవాదములు. మళ్ళీ నా ఈరోజు సక్రమముగా మొదలయ్యింది.

ఇట్లు
మీ నేస్తం.

**అనంత్‌గారూ, మీ అభిమాననికి మా కృతజ్ఞతలు. ||సం||**

*** *** ***